
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
3
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025



ఆపరేషన్ కగార్
అప్రజాస్వామిక చర్య

- పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్
- గద్వాలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 16వ మహాసభలు
- కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చల కోసం తీర్మానం

4



నల్లమల పచ్చబడ్డది

- పర్యాటకులకు స్వాగతం పలుకుతున్న పూలరెమ్మలు

మే నెలలో భానుడి భగభగలకు ప్రజలు, ప్రయాణికులు అల్లాడిపోతుంటారు. కాస్తంత నీడ దొరికితే అక్కడే సేదతీరాలని చూస్తారు. ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో చెట్లు చిగురించడంతో నల్లమల పచ్చబడింది. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి 70 కిలో మీటర్ల మేర అటవీ మార్గంలో ఉండటంతో పచ్చబడ్డ అడవి చూపరులను ఆకట్టుకుంటోంది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



సీఎం హోదాలో..
తొలిసారి

- నేడు మాచారం రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రూ.12,600 కోట్లతో చేపట్టనున్న 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభోత్సవం



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తున్న రేవంత్ రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్/అమ్రాబాద్/వంగూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : నల్లమల బిడ్డగా తరుచు ప్రస్తావించుకునే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో నేడు తొలిసారి ఈ ప్రాంతంలో పర్యటించున్నారు. అడవి బిడ్డల అభ్యున్నతి కోసం రూపొందించిన ఇందిరా సౌర గిరి జలవికాసం పథకానికి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని దాదాపు రూ.12,600 కోట్ల వ్యయంతో ఆయన సోమవారం అంకురార్పణ చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అదనపు ఎస్పీ రామేశ్వర్‌రావు పరిశీలించారు. అదేవిధంగా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు.

నల్లమలతో సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక అనుబంధం

నలమల్లతో సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన పుట్టి పెరిగిన ఊరు వంగూరు మండలం కొండారెడ్డిపల్లి. నల్లమలలో అంతర్భాగంగా ఉంది. పీసీసీ స్థాయిలో ఉండి అచ్చంపేటలో 2021 ఫిబ్రవరి 7న అచ్చంపేటలో రాజీవ్ రైతుదిశ సభను నిర్వహించి అచ్చంపేట నుంచి హైదారాబాద్ వరకు పాదయాత్ర చేయడం సంచలనమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి తన వాదనను చట్ట సభల్లో వినిపించారు. తనకు ఇష్టమైన నల్లమలకు సీఎం హోదాలో రేవంత్ రెడ్డి రానున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, వివిధ సంఘాల నాయకులు సమాయత్తం అవుతున్నారు.

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించి చెంచుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఉమ్మడి రాష్ట్రం స్పీకర్ నాదెండ్ల మనోహర్, ఆ తర్వాత తెలంగాణ అప్పటి గవర్నర్ తమిళిసై ప్రత్యేక నిధులు కేటాయించినా ఆ నిధులు చెంచుల దరి చేరలేదని ఆరోపణలు ఉన్నాయి. నేటి ముఖ్యమంత్రి పర్యటన తర్వాత అయిన చెంచుపెంటలకు రక్షిత మంచినీరు, విద్య, వైద్య సదుపాయం అందుతుందనే ఆశాభావంతో ఆడవి బిడ్డలు ఎదురు చూస్తున్నారు.



భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ముఖ్యమంత్రి రాక కోసం సిద్ధమైన హెలిప్యాడ్



గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

చేతులెత్తేసిన కార్యదర్శులు

- గ్రామాలలో ఖర్చుతో కూడిన పనులు బంద్
- ఒక్కో కార్యదర్శి అప్పులు చేసి పెట్టిన ఖర్చులు దాదాపు రూ.3 లక్షలు
- పెండింగ్‌లో రూ.1.89 కోట్ల బిల్లులు
- మరమ్మతులకు నోచుకోని మోటార్లు, పైపులైన్ లీకేజీలు
- నిలిచిపోయిన చెత్త సేకరణ ట్రాక్టర్లు, రోడ్లపై పారుతున్న మురుగు నీరు

4

అకాల వర్షం

- గద్వాల, వనపర్తి జిల్లాల్లో పలు చోట్ల తడిసిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



అలంపూర్ : పెద్ద ధన్వాడలో ధాన్యం చుట్టూ నిలిచిన వర్షపు నీరు

ఖిల్లాఘణపురం/రాజోలి, మే 18(ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోని పలుచోట్ల ఆదివారం భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలతో ఆరబెట్టిన ధాన్యం నీటిపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని వెంకటాంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యంపై కవర్లు కప్పేలోపే భారీ వర్షం రావడంతో పూర్తిగా తడిసిపోయింది. కొనుగోలు చేసి నింపిన ధాన్యపు బస్తాలు సైతం సకాలంలో ఎత్తకపోవడంతో తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అదేవిధంగా గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రాజోలిలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన జొన్నల బస్తాలు తడిసిపోయాయి. మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, తూర్పు గార్లపాడు, తుమ్మిళ్ల గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



వనపర్తి : వెంకటాంపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

అభివృద్ధి చేస్తే అవకాశాలెన్నో

- పర్యాటకాభివృద్ధి పైనే నల్లమల ప్రజల ఆశలు
- గత ప్రభుత్వాల ఏలుబడిలో నామమాత్రపు అభివృద్ధి



సలేశ్వర క్షేత్రం

4

పది శాతం
పూర్తి చేయడానికి రెడీ

- సీఎం, ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి రూ.2,740 కోట్లు తెప్పిస్తాం
- ప్రారంభించిన గంటకే బంద్ చేస్తే 90 శాతం పనులు పూర్తయినట్టా?
- రూ.1,742 కోట్లతో వనపర్తి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- సీఎం ప్రారంభించిన రూ.వెయ్యికోట్ల పనులు బరాబర్ చేసి తీరుతా
- విలేకరులతో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

మహబూబ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ నాయకులు పదేపదే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తమ హయాంలోనే 90 శాతం పూర్తయ్యిందని, 10 శాతం పనులను కాంగ్రెస్ పూర్తి చేయడం లేదని ఆరోపిస్తున్నారని, మిగిలి ఉన్న పనులు పది శాతమే అయితే తాము పూర్తిచేయడానికి సిద్ధంగా ఉన్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు రూ.27,400 కోట్లు గత ప్రభుత్వం 90 శాతం పనులకు ఖర్చు చేసిందని, ఇక పది శాతం పనులకు సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి.. రూ.2,740 కోట్లను మంజూరు చేయించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. రూ.60 వేల కోట్ల అంచనా వ్యయం కలిగిన ప్రాజెక్టులో రూ.27,400 కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు చేశామనడం కంటే అవివేకం మరొకటి లేదన్నారు. ఎన్నికలకు ముందు ఊరూరు నుంచి చెంబులు, గిన్నెలు తీసుకుని రమ్మని.. నార్లాపూర్ దగ్గర మోటార్ ప్రారంభించారని, అది గంటకే బంద్ చేస్తే ఎలా 90 శాతం పనులు పూర్తయినట్లో తెలిపాలని ఎద్దేవా చేశారు. కృష్ణానదిలో 2.19 ఎకరాల భూమిని కబ్జా చేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. సేవ్ వనపర్తి- ఛేంజ్ వనపర్తి ఆత్మ గౌరవ నినాదంతో వచ్చిన తమపై ఆరోపణలు చేయించడం దుర్మార్గమని ఎద్దేవా చేశారు. వనపర్తికి ప్రస్తుతం సాగునీరు అందిస్తున్న గుడిపల్లిగట్టు రిజర్వాయర్‌ను కాంగ్రెస్ పార్టీ నిర్మించిందని, ఇందులో నీళ్ల నిరంజన్‌రెడ్డి అని

(మిగతా 4లో..)

నిద్రమాత్రలు మింగి యువకుడి ఆత్మహత్య

4

కృష్ణానదిలో మృతదేహం లభ్యం

- గుంటిపల్లి వ్యక్తిగా గుర్తింపు..?

రేపటి నుంచి అండర్-23
ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ

- తలపడనున్న ఆరు జట్లు
- టోర్నీని ప్రారంభించనున్న ఎండీసీఏ ప్రతినిధులు



క్రీడాకారులను ఎంపిక చేస్తున్న కోచ్‌లు

4

వన మహోత్సవానికి..
మొక్కలు సిద్ధం

- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పెంచుతున్న 40.39 లక్షల మొక్కలు
- శాఖల వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలు



ఊర్కొండ మండలం..
ఊర్కొండ పేటలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నాగర్‌కర్నూల్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో వనమహోత్సవం నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియను గత ఏడాది అక్టోబరు నుంచే ప్రారంభించారు. ఈ ఏడాది పండ్ల, పూల మొక్కలు, నీడనిచ్చే తదితర జాతులకు చెందిన 40.39 లక్షల మొక్కలను నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. గత సంవత్సరం నాటిన మొక్కలు ఎదగకుండా చనిపోతే వాటి స్థానంలో మళ్లీ నాటాలని నిర్ణయించారు. ఎండల వేడిమికి మొక్కలు చనిపోకుండా ప్రతీ నర్సరీలో గ్రీన్‌షేడ్ నెట్ ఏర్పాటు చేశారు. జూన్, జూలై నెలల్లో ప్రభుత్వం నిర్వహించే వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 461 నర్సరీలు..

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల వారీగా మొత్తం 40.39 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. అందులో వ్యవసాయం, ఎక్సైజ్, అటవీ, హార్టికల్చర్, మునిసిపల్ తదితర శాఖల ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతుండగా అత్యధికంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 24.60 లక్షల మొక్కలు పెంచుతున్నారు. గ్రామ పంచాయతీకి ఒక్క నర్సరీని ఏర్పాటు చేసి మరో 1.21 లక్షల మొక్కలను అదనంగా పెంచుతోంది. జిల్లాలోని 461 నర్సరీల్లో ఒక్కో నర్సరీలో దాదాపు 5,600లకు పైగా మొక్కలు పెంచుతున్నారు. ఈ ఏడాది డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సీతాఫల్, ఈత, గన్నేరు, టెకోమా, కానుగ, గుల్‌మోర్, నల్లమద్ది వంటి మొక్కలను పెంచుతున్నారు. ప్రతీ నర్సరీలో 8 నుంచి 10 నెలల పాటు పెంచుతున్న మొక్కలు దాదాపు మీటరు నుంచి 2 మీటర్ల ఎత్తుకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రధాన శాఖలు పెంచుతున్న మొక్కలు ఇలా..

ప్రభుత్వ శాఖ	మొక్కల సంఖ్య (లక్షల్లో..)
డీఆర్‌డీఏ	24.60
వ్యవసాయం	2.55
ఎక్సైజ్	2.03
అటవీశాఖ	1.44
ఉద్యానవనం	1.28
మునిసిపాలిటీ	7.77
ఇతరములు	0.72
మొత్తం	40.39 లక్షల మొక్కలు

పండ్ల మొక్కలు పెంచుతున్నాం..



నర్సరీల్లో మొక్కలు ఎదగడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జిల్లాలో జూన్, జూలై మాసాల్లో వన మహోత్సవంలో పంపిణీ చేసే పండ్లు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను ప్రతీ ఇంట్లో నాటుకోవాలి. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచేలా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలి.

- చిన్నఓబులేష్, డీఆర్‌డీవో, నాగర్‌కర్నూల్

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి


రమేష్(ఫైల్)

వెల్దండ, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని భైరాపూర్ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే... కొట్ర గ్రామానికి చెందిన బూత్కూరి రమేష్ (32) అనే వ్యక్తి శనివారం బంధువుల ఇంటికి వెళ్తానని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి వరకు రమేష్ రాకపోవడంతో రమేష్‌కు భార్య లక్ష్మి ఫోన్‌చేసినా ఫోన్ ఎత్తలేదు. ఆదివారం ఉదయం భైరాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన రమేష్ మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కృష్ణానదిలో మృతదేహం లభ్యం

» గుంటిపల్లి వ్యక్తిగా గుర్తింపు..?

గద్వాల, మే 18(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం బీరెల్లి గ్రామం వద్ద గల కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం శవం గుర్తించారు. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ట్రైనీ ఎస్సైతో పాటు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. గుర్తుపట్టనంతగా చేపలు తినడంతో గుర్తించడం కష్టంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. అయితే పది రోజుల క్రితం గుంటిపల్లికి చెందిన వ్యక్తి కొనిపించకుండా పోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అతనేనా కాదా అనేది కుటుంబ సభ్యులు గుర్తించాల్సి ఉంది. మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తున్నారు.

నిద్రమాత్రలు మింగి యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీకి ప్రిపేర్ అవుతూ ఒత్తిడికిలోనై లక్ష్మన్న(35) అనే యువకుడు నిద్రమాత్రలు మింగాడని, చికిత్స పొందుతూ శనివారం రాత్రి కర్నూల్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీకి చెందిన లక్ష్మన్న కొంతకాలంగా మానసికంగా ఇబ్బందిపడుతున్నాడు. పీహెచ్‌డీ చదువుతూ ఒత్తిడికి లోనై ఈనెల 13న నిద్రమాత్రలు మింగాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. గతంలోనే పలుమార్లు ఆత్మహత్యాయత్నాలు చేశాడని తెలిపారు. అన్న రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి చేస్తే అవకాశాలెన్నో

» పర్యాటకాభివృద్ధి పైనే నల్లమల ప్రజల ఆశలు
» గత ప్రభుత్వాల ఏలుబడిలో నామమాత్రపు అభివృద్ధి
» విద్య, వైద్యం, సాగు, తాగునీరు, పర్యాటకం, రోడ్ల విస్తరణ చేపడితే మారనున్న అచ్చంపేట రూపురేఖలు


ఉమామహేశ్వర క్షేత్రం

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): 1962లో అచ్చంపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు స్థానికులకంటే స్థానికేతరులే ఎక్కువగా ప్రాతినిధ్యం వహించారు. వారిలో మహేంద్రనాథ్, రాములు మంత్రులుగా ఈ ప్రాంతానికి సేవలందించి కొంత అభివృద్ధికి పునాదులు వేశారు. మొదటి సారిగా అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తూ మాతృనియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో వెనుకబడిన నల్లమల ప్రాంతం ఇక నుంచి అభివృద్ధిలో పరుగులు పెడుతున్నదని కోటి ఆశలతో ఈ ప్రాంత ప్రజలు, నాయకులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి నోట హామీల జడివాన కురుస్తుందా.. అచ్చంపేట నియోజకవర్గంలో 8 మండలాలు ఉండగా పరిపాలన పరంగా వంగూరు, చారకొండ మండలాలు కల్వకుర్తి డివిజన్‌పరిధిలో ఉండగా మిగిలిన 6 మండలాలు అచ్చంపేట డివిజన్‌లో ఉన్నాయి. ప్రధానంగా పర్యాటక అభివృద్ధికి అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. నియోజకవర్గంలో ఆదివాసులు(చెంచులు), గిరిజనులు, ఎస్సీలు, వెనుకబడిన కులాలవారు అధిక మొత్తంలో ఉన్నారు. విద్య, వైద్యం ఉపాధిలో ఆశించిన మేర ఫలితాలు కనిపించని పరిస్థితి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితేనే రైతుకు భరోసా కలుగుతుంది.

వ్యవసాయం రంగం

నాగర్ కర్నూల్ జిల్లాలో భౌగోళికంగా 13,89,054 ఎకరాల భూమి ఉంది. ఇందులో సాగు భూమి 5,71,461 ఎకరాలు. కానీ ప్రాజెక్టులు పూర్తి కాక పచ్చగా ఉండాల్సిన భూములు బీడువారి పోయాయి. అచ్చంపేట నియోజకవర్గానికి తాగు, సాగు నీరందించే ఉమామహేశ్వర, చెన్నకేశవ ప్రాజెక్టులు పూర్తి అయితేనే ఈ ప్రాంత రైతుల మనుగడ ముందుకు సాగుతుంది. చంద్ర సాగర్ ప్రాజెక్టును ఆధునికీకరించి అచ్చంపేట రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యాటక ప్రాంతాలెన్నో...

నల్లమలలో దాగి ఉన్న పర్యాటక ప్రాంతాలెన్నో అభివృద్ధికి నోచుకోకుండ ఉన్నాయి. ఇందులో ప్రధానమైనవి వ్యూ పాయింట్, మల్లెల తీర్థం, ప్రతాపరుద్రుని కోట, ఆక్టోపస్, అక్కమహాదేవి గుహలతో పాటు ఉమామహేశ్వరం, భౌరాపూర్, సలేశ్వరం, లొద్దిమల్లయ్య తదితర ప్రాంతాలను అభివృద్ధి పరుస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

అందని ద్రాక్షగా ఉన్నత విద్య

నియోజక వర్గ కేంద్రంలో ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక పోవడం గమనార్హం. ప్రైవేటు కళాశాలలో చేరలేక మధ్యలోనే విద్యను ఆపేసి నేడు యువత కూలీలుగా మారుతున్నారు. ఇంజనీరింగ్ , ఆయుర్వేదిక్ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రధాన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ఈ అంశం ఎన్నికల అస్త్రంగా రాజకీయ నాయకులు వాడుకుంటున్నారే తప్ప అమలు పరచడం లేదు.



సలేశ్వర క్షేత్రం

రోడ్లు విస్తరిస్తే అభివృద్ధికి బాటలు

శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి మినహా చెప్పుకోదగ్గ రహదారులు ఏమిలేవు. శ్రీశైలం అటవీ మార్గంలో ఎలివేటర్ కారిడార్ నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. భూత్‌పూర్ నుంచి మద్దిమడుగు మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోని సరిగిరిపాడు వరకు 166 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టి కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే రవాణ సౌకర్యం పెరిగి ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంది. కొల్లాపూర్, లింగాల మీదుగా అచ్చంపేట వయా డిండి- దేవరకొండ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలనె డిమాండు ఉంది. రోడ్లు ఎరుగని పల్లెలెన్నో ఉన్నాయి.

ప్రాచుర్యం గల ఆలయాలు

నియోజక వర్గంలో ఎన్నో ప్రాచుర్యం కల ఆలయాలున్నాయి. మరో శ్రీశైలాన్ని తలపించే ఉమామహేశ్వర క్షేత్రం పర్యాటకంగా ఎంతగానో ఆకట్టుకుంటుంది. మరో భద్రాద్రిగా సిరసనగండ్ల రామాలయం, మద్దిమడుగు అంజన్న క్షేత్రంతో పాటు పురాతన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. కానీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చొరవ చూపిస్తే ఆంధ్రను తలతన్నేవిధంగా అభివృద్ధి చెందుతాయి.



వైద్య సేవలు కరువు

శ్రీశైలం-హైదరాబాద్ 765 జాతీయ రహదారితో పాటు మహబూబ్‌నగర్-మద్దిమడుగు రోడ్డులో ఎప్పుడు ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకొంటుంది. ఇదిలా ఉండగా వైద్యం అందక ఎంతో మంది చెంచులు రోగాల బారిన పడి మృత్యువడిలోకి జారుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే వైద్యుడైనందున కొన్ని సందర్భాలలో ఆయనే పేదలకు వైద్యం చేస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో ఆసుపత్రులలో వైద్యులు లేక నల్లమల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ ప్రాంతంలో అధునాతన సదుపాయాలతో పూర్తిస్థాయి సిబ్బందితో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆపరేషన్ కగార్ అప్రజాస్వామిక చర్య

» పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్
» గద్వాలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 16వ మహాసభలు
» కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చల కోసం తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

గద్వాల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో సాగుతున్న ఆదివాసీల ఊచకోత అప్రజాస్వామికమే కాక మానవీయతను మంట కలిపేదిగా ఉందని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. నక్సల్స్ ఏరివేత పేరుతో ప్రభుత్వం సాగిస్తున్న మారణహోమం దుర్మార్గమన్నారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో తెలంగాణ పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా 16వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ దండకారణ్యంలో ఆదివాసీలపై పోలీసులు సాగిస్తున్న దుశ్చర్యలకు అంతులేకుండా పోయిందన్నారు. ఇటీవల ఒక మహిళపై జరిపిన కాల్పుల్లో ఆరునెలల పసికూన పోలీసుల తూటాకు బలికావడం అక్కడి అనాగరిక చర్యలకు అద్దం పట్టేదిగా నిలిచిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. మహాసభల్లో ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మహిళలపై అత్యాచారాలను నిలిపివేయాలని, ఆది వాసీల జీవన హక్కును కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తీర్మానిం చామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు తెలిపారు. అనంతరం పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్య క్షుడిగా ఎండీ సుభాన్, ఉపాధ్యక్షులుగా ఎం.మహదేవ్, కాళేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జక్కా బాలయ్య, సహాయ కార్యదర్శులుగా కలకొండ రాములు, లక్ష్మీనారా యణ, బసవరాజ్, కోశాధికారిగా వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు.

రేపటి నుంచి అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ

» తలపడనున్న ఆరు జట్లు
» ప్రతిభ కనబరిస్తే ఉమ్మడి జట్టుకు ఎంపిక
» టోర్నీని ప్రారంభించనున్న ఎండీసీఏ ప్రతినిధులు


ఉమ్మడి జిల్లా టోర్నీకి ఎంపికైన ఎండీసీఏ జట్టు

2 డే లీగ్ మ్యాచ్‌ల వివరాలు

తేదీ	తలబడే జట్లు	వేదిక
మే 19, 20	నాగర్‌కర్నూల్-వనపర్తి జడ్చర్ల-మహబూబ్‌నగర్ గద్వాల-నారాయణపేట	నాగర్‌కర్నూల్ మహబూబ్‌నగర్ గద్వాల
మే 22, 23	మహబూబ్‌నగర్-గద్వాల వనపర్తి-నారాయణపేట జడ్చర్ల-నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్ నారాయణపేట జడ్చర్ల
మే 25, 26	నారాయణపేట-జడ్చర్ల మహబూబ్‌నగర్-నాగర్‌కర్నూల్ వనపర్తి-గద్వాల	వనపర్తి మహబూబ్‌నగర్ గద్వాల
మే 28, 29	మహబూబ్‌నగర్-వనపర్తి జడ్చర్ల-గద్వాల నారాయణపేట-నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్ జడ్చర్ల నాగర్‌కర్నూల్
మే 31, జూన్1	మహబూబ్‌నగర్-నారాయణపేట గద్వాల-నాగర్‌కర్నూల్ జడ్చర్ల-వనపర్తి	మహబూబ్‌నగర్ గద్వాల జడ్చర్ల

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంట్రా డిస్ట్రిక్ 2డే అండర్-23 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు ఎంపిక చేసి ఆరు జట్లుగా విభజించారు. పూల్-ఏలో మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, పూల్-బీలో జడ్చర్ల, గద్వాల, నాగర్‌కర్నూల్ జట్లు ఉన్నాయి. 90 ఓవర్ల మ్యాచ్‌లు, ఒక్కో జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతాయి. టోర్నీ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టుకు ఎంపిక చేస్తారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న అండ ర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొంటారు.

ప్రతిభ చాటాలి



ఇంట్రా డిస్ట్రిక్ అండర్-23 2డే క్రికెట్ టోర్నీని ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్నాం. 90 ఓవర్ల మ్యాచ్‌లు ఉంటాయి. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తాం. క్రీడాకారులు టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపికయ్యే అవకాశం ఉంది.

- ఎం. రాజశేఖర్, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

పది శాతం పూర్తి చేయడానికి రెడీ

(3వ పేజీ తరువాయి)

పిలిపించుకోవడానికి ఆయనకు అర్హత లేదన్నారు. వనపర్తి నియోజకవర్గంలో సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 4 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లను రూ.1,742 కోట్లతో చేపట్టనున్నట్లు ప్రకటించారు. మార్చి 2వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ప్రతీ పనిని బరాబర్ పూర్తి చేస్తానని అన్నారు. ఇప్పటికే రోడ్లకు టెండర్లయ్యాని, టీయూఎఫ్ఐడీసీ నిధులతో పెబ్బేరు, వనపర్తి మునిసిపాలిటీల్లో రూ.70 కోట్లతో సీసీ రోడ్లు ప్రారంభించామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, హాస్పిటల్, సీఎం చదివిన పాఠశాలకు త్వరలోనే టెండర్లు పూర్తవుతాయని అన్నారు. పెబ్బేరులో 30.19 ఎకరాల సంత స్థలానికి ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని, ఆ చిక్కులన్నీ తొలగించి.. సంత స్థలానికి కుర్చీ వేసుకుని ఫెన్సింగ్ వేయిస్తానని అన్నారు. గణపసముద్రం, బుద్ధారం చెరువుల విషయంలో టెండర్లు వేసి.. కమీషన్లు తీసుకుని వదిలేశారన్నారు. భూములు కోల్పోయిన వారికి తాను ఎకరాకు రూ.13.50 లక్షల పరిహారం ఫిక్స్ చేయించానని అన్నారు. కొత్త మండలాల్లో శాశ్వత భవన నిర్మాణాలు చేపడతామన్నారు. వనపర్తి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఒక్కో బ్యాగు మీద రూపాయి చొప్పున 4 లక్షల బ్యాగులకు మాజీ మంత్రి వసూలు చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకడం లేదని విమర్శించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ మాజీ చైర్మన్ మహేష్, నాయకులు శంకర్‌ప్రసాద్, ధనలక్ష్మి, సత్యశీలారెడ్డి, వెంకటేష్, బ్రహ్మచారి, పర్వతాలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్ల పట్టివేత

» డంప్ చేసిన ఇసుక సీజ్


పోలీస్ స్టేషన్‌లో ఇసుక టిప్పర్

గద్వాల, మే 18 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అలంపూర్ ఏరియా నుంచి గద్వాలకు తరలిస్తున్న ఇసుక టిప్పర్లను ఆదివారం తెల్లవారు జామున జమ్మిచేడు వద్ద పట్టుకున్నారు. వీరు జమ్మిచేడులోని ఓ గోదాములో అ క్రమంగా నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడ దాదాపు ఆరు టిప్పర్ల ఇసుకను డంప్ చేయగా దానిని సీజ్ చేశారు. టిప్పర్ల యజమాని ఉండవెల్లికి చెందిన ఆర్‌వీ శేషు, టిప్పర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చేతులెత్తేసిన కార్యదర్శులు

» గ్రామాలలో ఖర్చుతో కూడిన పనులు బంద్
» ఒక్కో కార్యదర్శి చేసిన ఖర్చులు దాదాపు రూ.3 లక్షలు
» పెండింగ్‌లో రూ.1.89 కోట్ల బిల్లులు
» మరమ్మతులకు నోచుకోని మోటార్లు, పైపులైన్ కేజీలు
» నిలిచిపోయిన చెత్తసేకరణ ట్రాక్టర్లు, రోడ్లపై పారుతున్న మురుగు నీరు


బోర్లను మరమ్మతు చేయిస్తున్న కార్యదర్శి (ఫైల్)


ఆర్థిక పరమైన ఖర్చులు భరించలేమని అదనపు కలెక్టర్‌కు లేఖ ఇస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు(ఫైల్)

గద్వాల, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. పంచాయతీలలో పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో ప్రత్యేక పాలనలో నడుస్తున్న గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు, వీధి దీపాలు చెత్తసేకరణ ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులు భరించలేక గ్రామ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఒక్కో కార్యదర్శి గ్రామాన్ని బట్టి దాదాపు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు చేతినుంచి ఖర్చు చేశారు. ఇక తమ నుంచి కాదని చేతులెత్తేస్తున్నారు. పాలన విధులు మాత్రమే చేస్తాం.. ఆర్థికపరమైన ఖర్చులు భరించలేము అని తెగేసి చెప్పడంతో పాటు అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారితో పాటు ప్రతీ ఎంపీడీవోకు వినతి పత్రాలు ఇచ్చారు.

15వ తేదీ నుంచి నిలిచిన చెత్తసేకరణ..

ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్థిక పరమైన పనులు చేయలేమని గ్రామ కార్యదర్శులు లిఖిత పూర్వకంగా లేఖలు ఇవ్వడంతో 255 గ్రామ పంచాయతీలలో ట్రాక్టర్లకు డీజిల్ పోసేవారు లేక చెత్తసేకరణ నిలిచిపోయింది. మల్టీవర్కర్లతో డ్రైనేజీలు తీయడంతో పాటు కూడలిలో రోడ్లు ఊడ్చి చెత్తను అక్కడే వదిలేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలలో బోరు మోటార్లు కాలిపోయాయి, పైపులైన్లు లీకేజీలు అవుతున్నాయ్... మరమ్మతులకు డబ్బులు లేక నిలిచిపోయాయి. ఇప్పటికే ఒక్కో కార్యదర్శి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు చేసి ఉండటంతో అధికారులు కూడా వారిపై ఒత్తిడి తేలేని పరిస్థితి ఉంది.

రూ.కోట్లలో బిల్లులు పెండింగ్..

గతేడాది జూరాల ప్రాజెక్టులో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు కూడా నీళ్ల అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణకు గ్రామ పంచాయతీలలో ఉన్న పీడబ్ల్యూఎస్ పథకాలన్నీ వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించింది. కలెక్టర్ సూచన మేరకు 255 గ్రామ పంచాయతీలలో పనులు చేశారు. 443 చేతి పంపులు, 302 విద్యుత్ మోటార్లతో పాటు పైపులైన్లకు మరమ్మతులు చేశారు. ఇందులో కొన్నింటికి మాజీ ప్రజాప్రతినిధులు ఖర్చు భరించగా మెజార్టీ పనులను పంచాయతీ కార్యదర్శులు చేతినుంచి చెల్లించారు. ఏడాది గడిచిపోయిన ఇప్పటి వరకు ఈ బిల్లుల చెల్లింపులు చేయక పెండింగ్‌లో పెట్టారు. ఇవి కాకుండా డీజిల్, వీధిలైట్లు, ఇతర ఖర్చులను భరించారు. కానీ ఇక తమ నుంచి కాదని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు.

కుటుంబాలు గడవడమే కష్టం..

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 168 మంది జూనియర్, 25మంది ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు ఉన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వచ్చే జీతం రూ.30వేల పైచిలుకు.. ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులకు వచ్చే జీతం రూ. 19వేలు, వీరికి కుటుంబాలు గడవడమే కష్టంగా ఉంది. ఇక గ్రామాలలో సమస్యల పరిష్కారం కోసం వీరు చేతినుంచి ఎలా భరిస్తారో అధికారులు ఆలోచించాలి. ఖర్చులు భరించలేక పంచాయతీ కార్యదర్శుల సంఘం సమావేశమై ఆర్థిక పరమైన పనులు చేయబోమని పరిపాలన విధులు మాత్రమే నిర్వహిస్తామని ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించారు.


ఖర్చులు భరించలేం



గ్రామ పంచాయతీలలో నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సమస్యల పరిష్కారంలో భాగంగా చేతినుంచి ఖర్చులు భరించి పరిష్కరించాం. చేసిన ఖరుట్లకు చెల్లింపులు లేవు. ఏడాదిపైగా వేసిన చెక్కులు క్లియర్ కావడం లేదు. ఇక భరించలేకనే మేము గ్రామాలలో విధులు మాత్రమే నిర్వహిస్తాం. ఖర్చులు భరించలేమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- ఖాజామీర్, జిల్లా అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్, గద్వాల జిల్లా

విధులు మాత్రమే నిర్వర్తిస్తాం



ఏడాదికి పైగా అభివృద్ధి పనులకు చేతి నుంచి ఖర్చు చేస్తున్నాం. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఓపీఎస్‌లకు వచ్చే జీతంతో కుటుంబాలు గడవడమే కష్టం.. అందుకే గ్రామాలలో విధులు మాత్రమే నిర్వహిస్తాం. అర్థిక పరమైన పనులు చేయలేమని అధికారులకు వినతి పత్రాలు అందించాం..

- వెంకటనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్, గద్వాల జిల్లా

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి) : నాగనూల్ చెరువులో పడి వ్యక్తి గురు ప్రభాకర్(39) మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగనూల్‌కు చెందిన ప్రభాకర్ హైదరాబాద్‌లో జీవనోపాధి కోసం వెళ్లి అక్కడ ఉంటున్నాడు. ఈ నెల 13న గ్రామానికి వచ్చిన ప్రభాకర్ మద్యానికి బానిసయ్యాడు. హైదరాబాద్ నుంచి భార్య లక్ష్మి ఈ నెల 16న గ్రామానికి వచ్చింది. భర్త ప్రభాకర్‌ను మద్యం తాగి ఇలా తిరుగుతుంటే.. సంసారం ఎలా అంటూ మందలించింది. అదే రోజు రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్య కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ పని కోసం వెళ్లవచ్చని అనుకున్నారు. అంతలోనే ఆదివారం చెరువులో శవం కన్పించడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి చూడగా అతని జేబులో సెల్‌ఫోన్ సిమ్ తీసి వేరే ఫోన్‌లో వేసి కాల్ కలిపారు. ప్రభాకర్ భార్య మాట్లాడటంతో మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారత్ సిమ్‌కార్డులతో పాకిస్థాన్‌లో వాట్సాప్

- మిలటరీ ఇంటెలిజెన్స్ సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్" పేరుతో ఏకకాలంలో మూడు రాష్ట్రాల్లో దాడులు
- ఏడుగురి అరెస్టు.. 948 సిమ్ కార్డుల స్వాధీనం
- సంగారెడ్డిలో పట్టుబడ్డ తాపీ మేస్త్రీ మొఫిసిల్ ఇస్లాం



గువాహటి/సంగారెడ్డి క్రైం(ఆంధ్రజ్యోతి), మే 18: "భారత ఆర్మీ జవానుకు.. పాకిస్థాన్ ఐఎస్ఐ నుంచి హనీట్రాప్..".. "భారత సిమ్‌కార్డులతో పాకిస్థానీ సైబర్ నేరగాళ్ల బురిడీ.. అమాయకుల లూటీ".. "టెర్రరిస్టుల ఫోన్లలో భారత సిమ్ నంబర్ల వాట్సాప్/టెలిగ్రామ్..".. తరచూ పతాక శీర్షికలకెక్కే ఈ తరహా వార్తల వెనక ఉన్న భారీ నెట్‌వర్క్ గుట్టును అసోం పోలీసులు రట్టు చేశారు. మిలటరీ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్' పేరుతో రంగంలోకి దిగిన అసోం పోలీసులు తెలంగాణ సహా.. మూడు రాష్ట్రాల్లో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 948 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోం డీజీపీ హర్మీత్‌సింగ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. మిలటరీ ఇంటెలిజెన్స్‌కు చెందిన గజరాజ్ కార్ప్స్ నుంచి పాకిస్థాన్‌లో వాడుతున్న ఘోస్ట్ సిమ్ నంబర్లపై అసోం పోలీసులకు సమాచారం అందింది. అంటే.. భారత్‌లో కొనుగోలు చేసిన సిమ్‌కార్డులకు సంబంధించిన వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్స్‌ను పాకిస్థాన్‌లో ఉన్న వారు నేరాల కోసం వాడుతుంటారు. మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిన నిందితులంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా.. అసోంకు చెందినవారే కావడంతో సమాచారాన్ని ఆ రాష్ట్ర పోలీసులకు అందజేశారు. "వెంటనే స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్)ను రంగంలోకి దింపాం. అసోంతో పాటు.. రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈనెల 16న దాడులు నిర్వహించి, ఏడుగురు నిందితులను అరెస్టు చేశాం. వీరిలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో సాధిక్(47), అతీక్(25), అల్వార్‌లో ఆరిఫ్‌ఖాన్(20), సాజిత్(21), అసోంలోని ధూబ్రీకి చెందిన జకారియా అహ్మద్(24), ఇదే ప్రాంతానికి చెందిన మొఫిసిల్ ఇస్లాం(19)ని తెలంగాణలోని సంగారెడ్డిలో అరెస్టు చేశాం. ధూబ్రీకి చెందిన అర్షద్‌ఖాన్(34) విదేశాలకు వెళ్తుండగా.. ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుకున్నాం. తదుపరి దర్యాప్తులో ధూబ్రీకి చెందిన మరో 14 మందిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నాం" అని డీజీపీ వివరించారు. అరెస్టయిన ఏడుగురి నుంచి 948 సిమ్‌కార్డులను, అక్రమ కమ్యూనికేషన్‌కు ఉపయోగించే పలు పరికరాలను సీజ్ చేశామని, అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. "నిందితులు భారత్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తప్పుడు డాక్యుమెంట్లతో సిమ్‌కార్డులు తీసుకుంటారని తేలింది. వారు పాకిస్థాన్‌లో ఉన్న వారికి ఆ వివరాలను అందజేసేవారు. పాక్‌లో ఉన్నవారు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే.. నిందితులు వారికి ఓటీపీలను అందజేసి, ఆయా యాప్‌లను యాక్టివేట్ చేయించేవారు. పాకిస్థాన్‌లో ఉండేవారు ఆ వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను సైబర్ నేరాలకు వాడేవారా? ఉగ్రవాదానికా? లేక ఇంకేమైనా నేరాలకా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది" అని ఎస్టీఎఫ్‌కు చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించారు.

సంగారెడ్డిలో కలకలం

అసోం పోలీసులు అరెస్టు చేసిన మొఫిసిల్ ఇస్లాంకు పాకిస్థాన్‌తో లింకులున్నట్లు తేలడంతో.. సంగారెడ్డి జిల్లాలో కలకలం రేగింది. అతను జిల్లాలోని కొండాపూర్ మండలం గొల్లపల్లిలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నట్లు స్థానిక స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. అతనితో కలిసి పనిచేసిన వారిని, మొఫిసిల్‌ను పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్‌ని ఎస్బీ బృందాలు ఆదివారం విచారించాయి. ఈ విచారణలో మొఫిసిల్ పది రోజుల క్రితమే పనిలో చేరినట్లు తేలింది. దాంతో.. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న అసోంకు చెందిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

'ఆపరేషన్ సిందూర్' తర్వాతే?

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ఐఎస్ఐకు చెందిన వారు భారతీయులతో ఇక్కడి సిమ్ నంబర్లతో సంభాషణలు కొనసాగించినట్లు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌పైనా సమాచారం కోసం కేంద్ర ఉద్యోగులకు వాట్సాప్‌లో సందేశాలు వచ్చినట్లు సమాచారం. ఆ వాట్సాప్ ఖాతాలను పరిశీలించగా.. సిమ్‌కార్డులు భారత్‌లో ఉండగా.. వాట్సాప్ వినియోగం పాక్‌లో జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన మిలటరీ ఇంటెలిజెన్స్.. ఆ సిమ్‌కార్డులు ఎవరి పేర్లతో ఉన్నాయో పరిశీలించి, సింహభాగం అసోం చిరునామాలు ఉండడంతో.. ఆ రాష్ట్ర పోలీసులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

'పహల్గాం'కు ముందు జ్యోతి పాక్‌లోనే!

న్యూఢిల్లీ, మే 18: పాకిస్థాన్ ఏజెంట్లతో కలిసి గూఢచర్యానికి పాల్పడ్డ హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతిమల్హోత్రా(34) వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. పహల్గాం ఉగ్ర దాడికి ముందు ఆమె పాకిస్థాన్‌లోనే ఉందని హరియాణాలోని హిస్సార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. తరచూ ఆమె పాక్ పర్యటనలకు వెళ్లారని, ఒకసారి చైనా పర్యటనకూ వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి మల్హోత్రా పాక్ ఏజెంట్లతో టచ్‌లో ఉన్నారని హిస్సార్ ఎస్పీ చెప్పారు. పోలీసులు ఆమె ఫోన్, లాప్‌టాప్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు. కాగా, గతేడాది మే నెలలోనే కపిల్ జైన్ అనే 'ఎక్స్' వినియోగదారు జ్యోతిపై దృష్టి సారించాలని ఎన్ఐఏను కోరుతూ 'ఎక్స్'లో పోస్ట్ చేయడం విశేషం. ఆమె తొలుత పాక్ ఎంబసీలో ఫంక్షన్‌కు హాజరైందని, తర్వాత పాక్ పర్యటనకు వెళ్లిందని, అనంతరం కశ్మీర్ పర్యటనకూ వెళ్లనుందని.. దీని వెనుక ఏదో ఉందని అందులో పేర్కొన్నారు. మే 7వ తేదీ నుంచి ఇప్పటివరకు పంజాబ్, హరియాణాల్లో మొత్తం ఏడుగురిని గూఢచర్యం కేసులో అరెస్టు చేశారు. ఈ గూఢచర్యం వ్యవహారం ఒడిశా రాష్ట్రానికీ చేరింది. ఒడిశాలో పూరీకి చెందిన ఓ మహిళా యూట్యూబర్‌కు జ్యోతి మల్హోత్రాతో పరిచయం ఉంది. జ్యోతి 2024 సెప్టెంబరులో పూరీని సందర్శించారు. పూరీకి చెందిన యూట్యూబర్ ఇటీవలే పాక్‌లోని కర్తార్‌పూర్ గురుద్వారాను సందర్శించారు.

గౌరవ్ గొగోయ్ ఐఎస్ఐతో పనిచేశారు

- కాంగ్రెస్ ఎంపీపై అసోం సీఎం హిమంత తీవ్ర ఆరోపణ

గువాహటి, మే 18: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్‌పై అసోం సీఎం హిమాంత బిశ్వశర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు గౌరవ్ ఆ దేశంలో పర్యటించారని, ఆ సంస్థతో కలిసి పనిచేశారని తెలిపారు. తొలిసారిగా ఈ విషయాన్ని చెబుతున్నానని అన్నారు. ఇందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సెప్టెంబరు పదో తేదీన ప్రజలకు వెల్లడిస్తామని తెలిపారు. బిశ్వశర్మ ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆరోపణ చేశారు. ఆయనేమీ విహార యాత్రకు వెళ్లలేదని, కచ్చితంగా శిక్షణ పొందడానికే వెళ్లి ఉంటారని ఆరోపించారు. దీనిపై గౌరవ్ గొగోయ్ స్పందిస్తూ సీఎం వ్యాఖ్యలు బీ-గ్రేడ్ సినిమా కన్నా దారుణంగా ఉన్నాయని అన్నారు. ఆయన మానసిక ఆరోగ్యంపై తనకు ఆందోళన ఉందని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు పెట్టిన ప్రొఫెసర్ అరెస్టు

సోనీపట్, మే 18: ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు వివాదాస్పదంగా ఉందన్న ఆరోపణపై అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలో ఉండగా ఆదివారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ నెల 7న ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిపై స్పందించిన అలీ ఖాన్.. వారు చెప్పిన మాటలు 'ఎవరికో ప్రతిబింబాలు మాదిరిగా ఉన్నాయ'న్న అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానించారు. ఇది ఆ మహిళా సైనికాధికారులను అవమానించేదిగా ఉందంటూ కేసు నమోదైంది.

రాజ్యాంగమే సుప్రీం!

శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పరం గౌరవించుకోవాలి

- ఈ వ్యవస్థల్లో ఏదీ ఎక్కువా.. తక్కువా కాదు
- ప్రజాస్వామ్యంలో 3 స్తంభాలూ సమానమే: సీజేఐ జస్టిస్ గవాయ్

ముంబై, మే 18: దేశంలో ఏ వ్యవస్థా గొప్పది కాదని.. భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలు.. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమేనని అన్నారు. ఇవి ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని.. పరస్పరం గౌరవించుకోవాలని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ తన పరిధిని అతిక్రమిస్తోందని పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నెల 14న 52వ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసి తొలిసారి ముంబై వచ్చిన ఆయన్ను మహారాష్ట్ర-గోవా బార్ కౌన్సిల్ ఆదివారం సత్కరించింది. రాష్ట్ర న్యాయవాదుల సదస్సు కూడా నిర్వహించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక స్వరూపం జోలికి అది వెళ్లడానికి వీల్లేదన్నారు. 'రాజ్యాంగం సర్వోన్నత అధికారం, చట్టపాలన, న్యాయవ్యవస్థకున్న స్వేచ్ఛ వంటివాటిని రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు సవరించడం గానీ, రద్దు చేయడం గానీ చేయజాలదు. రాజ్యాంగ మౌలిక నిర్మాణం దృఢతరమైనది. దాని మూలస్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమే. కలిసిమెలిసి పనిచేయాలి' అని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తిని కావడం సంతోషకరమని తెలిపారు. 'రాజ్యాంగంలోని మూడు స్తంభాలూ తమ తమ పరిధులకు లోబడి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. శాసన, న్యాయ్యవ్యవస్థలు చేసిన పలు చట్టాల కారణంగానే సామాజిక-ఆర్థిక న్యాయం భావన నెరవేరుతుంది' అని ఆకాంక్షించారు. ఆయన ఇచ్చిన 50 కీలక తీర్పుల సంకలనాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వాటిలో కొన్నిటిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తానిచ్చిన తీర్పు గురించి వివరించారు. 'నివాస హక్కు ప్రాథమిక హక్కు. ఏ వ్యక్తి అయినా ఏదైనా కేసులో నిందితుడైనా.. దోషిగా నిర్ధారణ అయినా.. అతడి కుటుంబ నివాసం చట్టబద్ధమైనదైతే.. దానిని తొలగించడానికి, కూల్చడానికి వీల్లేదు. చట్ట పాలనను అనుసరించి వ్యవహరించాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ దత్తా, బోంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో బాంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

'142' ప్రస్తావనపై చర్చ..

మహారాష్ట్ర సీఎస్, డీజీపీల ప్రోటోకాల్ ఉల్లంఘనపై జస్టిస్ గవాయ్ ఆర్టికల్ 142ను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. చట్టసభలు పంపిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట కాలపరిమితికి లోబడి ఆమోదించాల్సిందేనని 142వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించి సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇంకోవైపు.. రాష్ట్రపతిని సైతం నిర్దేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందా.. రాష్ట్రపతి గానీ, గవర్నర్ గానీ తమ విధుల నిర్వహణలో ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని రాజ్యాంగంలోని 361వ అధికరణ చెబుతోందని.. 201వ అధికరణ కింద విచక్షణాధికారాలు ఉన్న రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువు నిర్దేశించవచ్చా.. తదితర 14 ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల సుప్రీంకోర్టును వివరణ కోరారు. ఇది కోర్టును ధిక్కరించడమేనంటూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ 142 అధికరణపై చేసిన వ్యాఖ్య చర్చనీయాంశమైంది.

కలసికట్టుగా వ్యతిరేకిద్దాం!

'సుప్రీం'ను రాష్ట్రపతి వివరణ కోరిన వ్యవహారంలో

8 రాష్ట్రాలకు స్టాలిన్ లేఖ

చెన్నై, మే 18(ఆంధ్రజ్యోతి): 'శాసనసభలు ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు నిర్ణయించడానికి వీలుందా?' అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలతో సుప్రీం కోర్టును వివరణ కోరడాన్ని కలిసికట్టుగా వ్యతిరేకించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు పశ్చిమబెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార్ఖండ్, పంజాబ్, జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు గవర్నర్, రాష్ట్రపతికి గడువును నిర్ణయిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు తమిళనాడు రాష్ట్రానికేకాక అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది" అన్నారు.

సీఎస్, డీజీపీ డుమ్మా..

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సీజేఐ ఆగ్రహం

సీజేఐ సన్మాన కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గానీ, డీజీపీ గానీ, ముంబై పోలీసు కమిషనర్ గానీ హాజరు కాలేదు. దీనిపై సదస్సులో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. 'ఒక మహారాష్ట్రీయుడు భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టి.. తొలిసారి స్వరాష్ట్రానికి వస్తే.. హాజరు కావడం సముచితమని మహారాష్ట్ర సీఎస్, డీజీపీ, ముంబై కమిషనర్‌కు అనిపించలేదంటే.. ఇది కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలి. న్యాయవ్యవస్థను ఇతర వ్యవస్థలు గౌరవించడానికి సంబంధించిన అంశమిది. ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉండాలని నేను పట్టుబట్టడం లేదు. అయితే ఓ వ్యవస్థ లేదా విభాగాధిపతి.. తొలిసారి రాష్ట్రానికి వస్తే.. అందునా ఆయన అదే రాష్ట్రానికి చెందినవారైతే.. ఇలా వ్యవహరించడం సముచితమో కాదో వారు ఆలోచించుకోవాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాల జోలికి నేను వెళ్లను. అయితే ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందనే దీనిని ప్రస్తావించాను. అదే మా న్యాయమూర్తుల్లో ఎవరైనా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే.. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలిచ్చే 142వ అధికరణపై చర్చలు పెట్టేస్తారు' అని గవాయ్ ఆక్షేపించారు. వ్యక్తులు తప్పనిసరిగా తన ముందు హాజరవ్వాలని ఆదేశాలిచ్చే అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఈ అధికరణ ఇచ్చింది. బార్‌కౌన్సిల్ సన్మానం తర్వాత బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక చిహ్నమైన చైత్యభూమిని సీజేఐ సందర్శించారు. అప్పటికే ఆయన చేసిన వ్యాఖ్యలు తెలియడంతో మహారాష్ట్ర సీఎస్ సుజాతా సౌనిక్, డీజీపీ రష్మీ శుక్లా, ముంబై పోలీసు కమిషనర్ దేవేన్ భారతి హడావుడిగా అక్కడకు చేరుకున్నారు.

లోకం తీరు



బయటికి చెప్పుకోలేక చనిపోతున్నారు!



నూఢిల్లీ, మే 18: పురుషుల్లో రోజురోజుకూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయని మానసిక వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను సమాజంలో చెప్పుకొనే పరిస్థితులు లేకపోవడం, పరిస్థితులను ఎదుర్కోవడానికి న్యాయపరమైన వెసులుబాట్లు లేకపోవడంతో బాధితులు కుమిలిపోతున్నారని తెలిపారు. ఫలితంగా పురుషుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వివరించారు. 2022లో భారతదేశంలో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 72% మంది పురుషులేనన్న ఎన్‌సీఆర్‌బీ నివేదికను వారు ఉటంకించారు. గృహ హింస కేసులు, లైంగిక వేధింపుల కేసులు, న్యాయపరమైన వేధింపులు, భావోద్వేగాలను రెచ్చగొట్టడం, అసత్య ఆరోపణలు.. ఇలాంటి అంశాలు పురుషుల్లో ఎంతో మానసిక సంఘర్షణకు కారణం అవుతున్నాయని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యవహారాల్లో ఉపశమనం కోసం పురుషులకు తగిన న్యాయపరమైన వెసులుబాట్లు లేవని, దీనిపై వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు నొక్కి చెప్పారు. హరియాణాలో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో వివాహితులైన పురుషుల్లో 52.4శాతం మంది తాము లింగ వివక్షను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ అధ్యయనాన్ని మానసిక వైద్య నిపుణులు ప్రస్తావించారు. పురుషుల మానసిక సమస్యలను చూసీచూడనట్లు వదిలివేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని, న్యాయపరమైన సంస్కరణలు అవసరమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ జనరల్ సెక్రటరీ శ్వేతా శర్మ అభిప్రాయపడ్డారు.

భారత్‌తో ఉద్రిక్తతలుంటే కష్టమే!

- 'బెయిల్ అవుట్' లక్ష్యాలకు ముప్పు
- పాక్‌కు ఐఎంఎఫ్ హెచ్చరిక

ఇస్లామాబాద్, మే 18: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు తదుపరి నిధుల మంజూరుపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల విషయంలో పాక్‌కు హెచ్చరిక చేయడంతోపాటు కొత్తగా 11 షరతులు విధించింది. బెయిల్ అవుట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తదుపరి విడత నిధులు విడుదల చేయాలంటే ఇవి పాటించాల్సిందేనని స్పష్టంచేసింది. భారత్‌లో ఉద్రిక్తతలు ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణల లక్ష్యాలకు ముప్పు పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించిందని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక ఆదివారం నివేదించింది. పాకిస్థాన్‌కు విధించిన షరతుల్లో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంటరీ ఆమోదం, విద్యుత్తు బిల్లులపై రుణ సేవల సర్‌చార్జి పెంపు, మూడేళ్లకుపైగా వినియోగించిన కార్ల దిగుమతిపై ఆంక్షల తొలగింపువంటివి ఉన్నాయి. ఈమేరకు ఐఎంఎఫ్ శనివారం స్టాఫ్ లెవల్ రిపోర్టును విడుదల చేసింది. 'భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు అలాగే కొనసాగినా, పరిస్థితి మరింత దిగజారినా.. అది బెయిల్ అవుట్ ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు ముప్పును పెంచుతుంది' అని పేర్కొంది. తాజా నిబంధనలతో పాక్‌పై ఐఎంఎఫ్ విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను ఐఎంఎఫ్ తన నివేదికలో ప్రస్తావించింది. అయితే మార్కెట్ ప్రతిస్పందన నియంత్రణలోనే ఉందని పేర్కొంది. వచ్చే ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 12శాతం పెంపు అని తెలిపింది. ఐఎంఎఫ్ అంచనాలతో పోలిస్తే.. భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.2.5 ట్రిలియన్లు అధికంగా కేటాయిస్తున్నట్లు పాక్ ప్రభుత్వం సూచించింది.

33 దేశాల రాజధానులు! 7 ప్రతినిధి బృందాలు

ఉగ్రవాదంపై భారత వైఖరి వినిపించడానికి సిద్ధం

- ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీల వారు 20 మంది
- తెలంగాణ నుంచి ఒవైసీకి స్థానం
- ఈ నెల 23 నుంచి పర్యటనలు



న్యూఢిల్లీ, మే 18: అంతర్జాతీయ వేదికపై పాక్ కుతంత్రాలను ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల రాజధానులను సందర్శించనున్నాయి. ఈ బృందాల్లో ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీలకు చెందిన 20 మందితోపాటు 8 మంది మాజీ దౌత్యవేత్తలు కలిపి మొత్తం 59మంది సభ్యులు ఉంటారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రధాన కార్యాలయాన్ని కూడా వీరు సందర్శిస్తారు. ఈ నెల 23 నుంచి ఈ బృందాల పర్యటనలు ప్రారంభంకానున్నాయి.

- సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాలకు వెళ్లే మొదటి ప్రతినిధి బృందంలో బీజేపీ ఎంపీలు బైజయంత్ పాండా, నిశికాంత్ దూబే, ఫాంగ్నోన్ కొన్యాక్, రేఖా శర్మతోపాటు అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), సత్నామ్ సింగ్ సంధూ (నామినేటెడ్ ఎంపీ), గులాం నబీ ఆజాద్ (కేంద్ర మాజీ మంత్రి, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం), హర్ష్ శ్రింగ్లా (విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి) ఉంటారు.
- యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాలకు వెళ్లే రెండో బృందంలో బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీ), సమిక్ భట్టాచార్యతోపాటు అమర్ సింగ్ (కాంగ్రెస్), ప్రియాంక చతుర్వేది (శివసేన-యూబీటీ), గులాం అలీ ఖతానా (నామినేటెడ్ ఎంపీ), ఎంజే అక్బర్ (కేంద్ర మాజీ మంత్రి), పంకజ్ సరన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- ఇండోనేషియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లో పర్యటించే మూడో బృందంలో సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), అపరాజితా సారంగి, బ్రిజ్‌లాల్, ప్రధాన్ బారువా, హేమాంగ్ జోషి (బీజేపీ), యూసఫ్ పఠాన్ (టీఎంసీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), సల్మాన్ ఖుర్షీద్ (కాంగ్రెస్), మోహన్ కుమార్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- యూఏఈ, లైబీరియా, కాంగో, సిరియా, సియెర్రా లియోన్ దేశాలలో పర్యటించే నాలుగో బృందంలో శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిందే (శివసేన), బాన్సురి స్వరాజ్, అతుల్ గార్గ్, మనన్ కుమార్ మిశ్రా(బీజేపీ), ఎస్ఎస్ అహ్లూవాలియా (బీజేపీ మాజీ ఎంపీ), సస్మిత్ పాత్ర (బీజేడీ), మహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), సుజన్ చినోయ్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాలను సందర్శించే ఐదో బృందంలో శశిథరూర్ (కాంగ్రెస్), శాంభవి (ఎల్‌జేపీ- రామ్‌విలాస్), సర్ఫరాజ్ అహ్మద్ (జేఎంఎం), జీఎం హరీశ్ బాలయోగి (టీడీపీ), శశాంక్ మణి త్రిపాఠి, భువనేశ్వర్ కలితా, తేజస్వి సూర్య (బీజేపీ), మిలింద్ మురళీ దేవరా (శివసేన), తరణ్‌జీత్ సంధూ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- స్పెయిన్, గ్రీస్, స్లొవేనియా, లాత్వియా, రష్యాల్లో పర్యటించే ఆరో బృందంలో కనిమొళి(డీఎంకే), రాజీవ్ రాయ్ (ఎస్పీ), మియాన్ అల్తాఫ్ అహ్మద్ (ఎన్సీ), బ్రిజేష్ చౌతా (బీజేపీ), ప్రేమ్ చంద్ గుప్తా (ఆర్జేడీ), అశోక్ కుమార్ మిట్టల్ (ఏఏపీ), మంజీవ్ ఎస్ పూరీ (మాజీ దౌత్యవేత్త), జావేద్ అష్రాఫ్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- ఈజిప్ట్, ఖతార్, ఇథియోపియా, దక్షిణాఫ్రికా దేశాలను సందర్శించే ఏడో ప్రతినిధి బృందంలో సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్సీపీ), రాజీవ్ ప్రతాప్ రూడీ, అనురాగ్ సింగ్ ఠాకూర్, వి.మురళీధరన్ (బీజేపీ), విక్రమజీత్ సింగ్ సాహ్నీ (ఏఏపీ), మనీశ్ తివారీ, ఆనంద్ శర్మ(కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయులు (టీడీపీ), సయ్యద్ అక్బరుద్దీన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.


పాక్.. కాపీ, పేస్ట్ దౌత్యం!

- భారత్‌కు కౌంటర్‌గా విదేశాలకు శాంతి ప్రతినిధుల బృందం

ఇస్లామాబాద్, మే 18: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందన్న అపఖ్యాతి నుంచి బయటపడేందుకు, ప్రపంచ వేదికపై తన పరువు ప్రతిష్ఠలు కాపాడుకోవడానికి పాకిస్థాన్ నానాపాట్లు పడుతోంది. పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను నియమించింది. దీన్ని కాపీ కొడుతూ శాంతి కోసం తాము పాకులాడుతున్నామనే వాదనను వినిపించడానికి పాక్ సిద్ధమైంది. తమపై భారత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించడానికి ఒక ఉన్నత స్థాయి దౌత్య ప్రతినిధి బృందాన్ని ప్రధాన దేశాలకు పంపడానికి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిర్ణయించారని రేడియో పాకిస్థాన్ నివేదించింది. భారత ప్రభుత్వం తమ దౌత్య బృందాల వివరాలను వెల్లడించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రకటన వెలువడింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని ఈ శాంతి ప్రతినిధి బృందం అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యాల్లో పర్యటిస్తుందని...శాంతి, స్థిరత్వం కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తుందని పీఎంవో పేర్కొంది.

సింధ్‌లో లష్కర్ ఉగ్రవాది ఖాలిద్ హతం

- కాల్పులు జరిపిన గుర్తు తెలియని వ్యక్తి



న్యూఢిల్లీ, మే 18: లష్కర్ ఎ తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాది రజావుల్లా నిజామానీ ఖాలిద్ అలియాస్ అబూ సఫీవుల్లా ఖాలిద్ ఆదివారం పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హతమయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తి అతడిపై కాల్పులు జరిపినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం మాల్టీలోని తన ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా బాద్నీ క్రాసింగ్ వద్ద కాల్పులు జరిగాయని పేర్కొన్నాయి. 2006లో నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడికి ఇతడే కీలక సూత్రధారి. ముగ్గురు తీవ్రవాదులు వచ్చి కాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో వారంతా మరణించారు. దాదాపు 25ఏళ్లుగా భారత్‌పై ఏదో రూపంలో దాడులు చేస్తూనే ఉన్నాడు. తొలుత 2000లో నేపాల్‌లో లష్కర్ ఎ తోయిబాను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించాడు. ఉగ్రవాదుల భర్తీని కూడా అప్పుడే చేపట్టాడు. వినోద్ కుమార్, రజావుల్లా, మహమ్మద్ సలీం వంటి మారు పేర్లతో భారత్‌లో పలుమార్లు దాడులు చేశాడు. 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌పై జరిగిన దాడికీ కీలక సూత్రధారి ఇతడే. ఆ దాడిలో ప్రొఫెసర్ మునీష్ చంద్ర పురీ ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. దాడులు చేసిన ఉగ్రవాదులు తప్పించుకున్నారు. దర్యాప్తు జరిపిన పోలీసులు లష్కర్ అగ్రనాయకుడు అబు అనీస్‌పై కేసు పెట్టారు. అతడు ఇప్పటికీ పోలీసులకు చిక్కలేదు. ప్రస్తుతం హతమైన ఖాలిద్..అబు అనీస్‌కు అత్యంత సన్నిహితుడు. 2008లో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ స్థావరంపై జరిగిన దాడిలోనూ కీలక పాత్ర పోషించాడు. ఆ దాడిలో ఏడుగురు జవాన్లు, మరో సాధారణ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. దాడి చేసిన ఇద్దరు ఉగ్రవాదులు తప్పించుకున్నారు.

పాకిస్థాన్ కంటే నరకానికే వెళ్తా

- పుస్తకావిష్కరణ సభలో సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్



ముంబై, మే 18: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశంపై ప్రముఖ బాలీవుడ్ సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు వెళ్లాలా? నరకానికి వెళ్లాలా? అన్న ఆప్షన్లు తన ముందుకొస్తే తాను నరకాన్నే ఎంచుకుంటానని పేర్కొన్నారు. శనివారం ముంబైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ సభలో జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. తనపై చాలా మంది ప్రశంసించారని, అదే సమయంలో ఇరుపక్షాల 'వేర్పాటువాదుల' నుంచి అవమానాలు, విమర్శలను ఎదుర్కొన్నానని చెప్పారు. 'నేను నాణేనికి ఒకవైపు చూస్తే నీవు నాస్తికుడి (కఫీర్)వి కనుక నరకాని (జహనుమ్)కి పొమ్మంటుంది. మరోవైపు చూస్తే నువ్వు ఉగ్రవాది (జిహాదీ)వి కనుక పాకిస్థాన్‌కు పొమ్మంటుంది. ఒకవేళ నా ముందు రెండు (పాకిస్థాన్/నరకం) అవకాశాలుంటే నేను నరకానికెళ్లడానికి ఇష్టపడతా' అని చెప్పారు.

ఇంటర్వ్యూ

నిరుపేదలకు ఉపాధి హామీ తోడ్పాటునిస్తుంది

» నరసింహ, ఏపీవో, ఊర్కొండ



ఊర్కొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఎంతో తోడ్పాటునిస్తుందని ఏపీవో నరసింహ అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో ఉపాధి హామీలో ఖర్చు ఎంత?

మండలంలో 2024-25లో ఉపాధి హామీ పథకంలో రూ.4.55 లక్షలు ఖర్చు చేయడం జరిగింది. అందులో ఉపాధి కూలీలు 4102 మంది ఉండగా కుటుంబాల వారు 2754 లబ్ధి పొందారు. రూ.1.81 లక్షలు మెటల్ కంపోనెంట్ నిమిత్తం ఖర్చు చేశారు.

ఏయే పనులు నిర్వహిస్తున్నారు?

ఉపాధి హామీ పథకంలో రైతుల పొలాలకు వెళ్లే నక్లరోడ్లు అభివృద్ధి చేయడం, వాటికి అనుగుణంగా ఎవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నాం. రైతుల కోరిక మేరకు జంగిల్ కటింగ్, గల్లీ కంట్రోల్ చేయడం జరుగుతుంది.

హరితహారం పనులు ఎలా కొనసాగుతున్నాయి?

హరితహారంలో భాగంగా పెద్ద మొక్కలు 41,670 నాటాలని ప్రభుత్వం నిర్దేశించినది. వాటికి లక్ష్యంగా పెట్టుకొని ఊర్కొండపేట నర్సరీని పరిశీలించాం.

ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పిస్తున్నారా?

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కొనసాగుతున్నది. వేసవి దృష్ట్యా కూలీలకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పని చేసేచోట మంచినీటి సదుపాయం కల్పించాం. ఉదయం 12 గంటల సమయం లోపే పనులు చేసేవిధంగా అవగాహన కల్పించాం. కొలతల ప్రకారం పనులు చేస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని తెలియజేశాం.

న్యూస్ బాక్స్

బహిరంగ సభను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాల్‌లింగంగౌడ్

అమ్రాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండల పరిధిలోని మాచారంలో సోమవారం ఇందిర సౌర గిరి జల వికాస పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నోముల బాల్‌లింగంగౌడ్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసుమల్ల వెంకటయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. నల్లమల ప్రాంతంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు ముక్రంఖాన్, తిరుపతయ్యగౌడ్, మల్లేష్, నిరంజన్, వెంకటేశ్వర్లు, కోటి తదితరులు ఉన్నారు.

'కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం'

చారకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ్ సందీప్‌రెడ్డి, కల్లు సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన రమాదేవి గతంలో అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో మంజూరైన రూ. 22వేలచెక్కును ఆదివారం బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ డబ్బులను వెంటనే చెల్లించాలి

పెంట్లవెల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ డబ్బులను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల నాయకుడు కురుమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం పని చేసిన ఉపాధి హామీ డబ్బులు కూడా ఇప్పటి వరకు రాలేదని వారు పేర్కొన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం పని చేసిన డబ్బులు కూడా రాలేదని వారన్నారు. ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దకొత్తపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంకటస్వామి తనయుడు పరశురామ్(20)ఆదివారం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. వీరి వెంట మాజీ తాజా సర్పంచ్‌లు అరవింద్, సాలయ్య, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ ఉన్నారు.

అమలుకాని రుణమాఫీ

» 499 మంది రైతుల ఎదురు చూపు



పెంట్లవెల్లిలో రుణమాఫీ చేయాలని రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

పెంట్లవెల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నా ప్రభుత్వం వారి బాధలను పట్టించుకోవడం లేదు. పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో రుణాలు పొందిన ఒక్క రైతు కూడా రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం మూడు విడతలుగా మాఫీ చేసినా పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, వేముకల్, పెంట్లవెల్లి, రామాపురం, సోమశిల, మాధవస్వామినగర్, గ్రామాలకు చెందిన 499 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారు. వీరికి రూ.3 కోట్ల 26 లక్షలు రుణమాఫీ కావల్సి ఉంది. కానీ ఒక్క రైతుకు కూడా మాఫీ వర్తించలేదు. దీంతో రైతులు సింగిల్‌విండో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ అవుతుందో కాదేమోనని భయందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన రుణమాఫీ అన్ని బ్యాంకులు సొసైటీలతో సమానంగా మాఫీ మా సొసైటీలో కూడా మాఫీ అయింది. కానీ ఇప్పుడు రుణమాఫీ కావడం లేదని రైతులు వాపోతున్నారు. రుణ మాఫీ చేయాలని గతంలో తహసీల్దార్, కలెక్టర్‌ను, కమిషనర్ ఉదయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అయినా ఫలితం లేకుండా ఉందని ఆవేదన చెందుతున్నారు.

రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నాం



సింగిల్‌విండో కార్యాలయంలో తీసుకున్న రుణాలు మాఫీ అవుతాయని ఎదురు చూస్తున్నాం. గత ప్రభుత్వం విడతల వారిగా మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క రైతుకు కూడా రుణ మాఫీ కాలేదు. ప్రభుత్వం చొరవ చూపి అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ వర్తింప చేయాలి.

- రాజేష్, మాజీ సర్పంచు, పెంట్లవెల్లి

రూ. 40వేలు రుణం తీసుకున్నాం



మూడు సంవత్సరాల క్రితం పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో 40వేలు రుణం తీసుకున్నా. రుణ మాఫీ నాకు వర్తించలేదు. రుణమాఫీ కోసం గతంలో స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశాం. కానీ ఇంత వరకు కూడా రుణ మాఫీ కాలేదు. ఇప్పటికైనా రుణమాఫీ చేయాలని కోరుతున్నాం.

- ఆర్.వెంకటస్వామి పెంట్లవెల్లి రైతు

55 సొసైటీలు పెండింగ్‌లో ఉన్నాయి

రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీలు 55 ఆఫ్‌లైన్ సొసైటీలు ఉన్నాయి. సొసైటీలలో ప్రభుత్వం రుణ మాఫీ చేసినప్పుడు మొదటి విడత వర్తించలేదు. దీంతో రుణమాఫీ రాష్ట్ర కమిషనర్ ఉదయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశాం. బడ్జెట్ లేకపోవడంతో రుణమాఫీ కాలేదని వారు పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేస్తామని వారు హామీ ఇచ్చారు.

- విజయ రామారావు సింగిల్‌విండో చైర్మన్ పెంట్లవెల్లి

42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

» ఆ మూడు పార్టీలు బీసీలను మోసం చేశాయి

» బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్



కొల్లాపూర్‌లో రిలే నిరాహార దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న బీసీ జన చైతన్య సభ జాతీయ అధ్యక్షుడు దాసరి అజయ్ కుమార్ యాదవ్

కొల్లాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏడున్నర దశాబాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను అన్ని రంగాల్లో చిన్న చూపు చూస్తూ మోసం చేశాయని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి పట్టణ పుర వీధుల గుండా రాజా బంగ్లా వరకు బీసీ హక్కుల సాధనకై నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలోని రాజా బంగ్లా ముందు ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడ్యాల శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ డీఈవో శివార్చక విజయ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్, పచ్చిపాల సుబ్బయ్య, బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు పరిచే వరకు రాష్ట్రంలో ఉన్న ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో రిలే దీక్షలు చేపడతామన్నారు. ముందుగా సీఎం సొంత జిల్లా అయిన నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించామని తెలిపారు. కొల్లాపూర్‌లో రిలే దీక్షకు బీసీలు స్వచ్ఛందంగా తరలి వచ్చి పాల్గొన్నారని, గ్రామ గ్రామాన బీసీ కులాలను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తాము ఉద్యమిస్తామన్నారు. మండల్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ శంకర్ యాదవ్, సదానంద్ గౌడ్, బీసీ జన చైతన్య వేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బోయిని మహేష్ యాదవ్, బీసీ జన చైతన్య వేదిక నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, రాజేందర్, మేకల సాయిలు యాదవ్, వాకిటి ఆంజనేయులు గాలి యాదవ్, 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి జేఏసీ నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు అందించేందుకు కృషి

» రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి అరుణ్ వెల్లడి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి అరుణ్

కొల్లాపూర్, మే 18(ఆంధ్రజ్యోతి) : నేటి భావితరానికి భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి అరుణ్ పేర్కొన్నారు. అందులో భాగమైన కూచిపూడి, భరత నాట్యం పేరిట నృత్యాలు, కర్ణాటక సంగీతంతో పాటు విద్యార్థులకు పెయింటింగ్ బోనాల కోలాటం (మహిళలకు) ఫోక్ డ్యాన్స్ నాటికలను రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో నేర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన కొల్లాపూర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సాంస్కృతిక శిక్షణ శిబిరాన్ని రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి జగన్ మోహన్ రావు, డైరెక్టర్ జూపల్లి అరుణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్ మాట్లాడుతూ... వేసవి సెలవుల సందర్భంగా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సహకారంతో టూరిజం, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ జూపల్లి కృష్ణారావు సహకారంతో విద్యార్థులకు, మహిళలకు ఉచితంగా వివిధ సాంస్కృతిక కళల పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను ఈ ప్రాంత విద్యార్థులు చిన్నారులు సద్వినియోగపరుచుకుని చదువుతో పాటు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలని జూపల్లి అరుణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహిళలు బోనాలతో బతుకమ్మ కోలాటాలు పలువురిని ఆకర్షించాయి. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొల్లాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

» డాక్టర్ విజయ్‌కుమార్



క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

కల్వకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ప్రముఖ వైద్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆటలపై పిల్లలు మక్కువ చూపేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జూన్ 1న సికింద్రాబాద్‌లోని జింఖానా అథ్లెటిక్స్ ప్రధాన స్టేడియంలో 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, నాయకులు అంజయ్య, రాజు, శేఖర్, ప్రేమ్‌సాగర్, రణం, అరుణ్, వ్యాయామ ఉపాధ్యాయులు పురం చందు, రమేష్, ప్రకాశ్, ప్రశాంత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల తురుపు జాతి పొడను

తెలంగాణ అంబాసిడర్‌గా గుర్తించాలి

పదర, మే 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నల్లమల తురుపు జాతి పొడను తెలంగాణ రాష్ట్ర అంబాసిడర్‌గా ప్రటించాలని ఇస్కాన్ ప్రతినిధి, భగవద్గీత ప్రచారకులు మహేశ్వర్‌దాస్ అన్నారు. ఆయన ఆదివారం అచ్చంపేట నియోజకవర్గంలో హరేకృష్ణ సెంటర్లను పరిశీలించారు. నేడు నల్లమలకు వస్తున్న సీఎంను ఉద్దేశించి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. నల్లమల ప్రాంతంలో అత్యంత పురాతన ఆలయాలను గుప్తనిధుల పేరిట తవ్వుతున్నారని, వాటికి పరిపూర్ణ రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అమ్రాబాద్ మండలంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, పదర మండలంలోని రాయలగండి చెన్నకేశవాలయం తవ్వకాలకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

మాచారానికి రానున్న ఉప ముఖ్యమంత్రి

అమ్రాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించే ఇందిర సౌర గిరి జల వికాస పథకంలో పాల్గొనేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాచారం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎం రేవంత్ రెడ్డితో పాటే ఉదయం 11 గంటలకు మాచారం చేరుకుంటారని ఆయన తెలిపారు. వారికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలకాలని సూచించారు.

ఎంపీ మల్లురవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి నల్లమల పర్యటన ఏర్పాట్లను వీక్షిస్తున్న పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవిని తిమ్మాజిపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌బహదూర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, మున్ననూర్ దగ్గర ఆదివారం కలిసి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తైందని, ఈ మేరకు అధికారులు లబ్ధిదారుల స్థల పరిశీలన చేసి విచారణ చేపట్టారని, తరలింపు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరినట్లు వివరించారు.

రిలే దీక్షకు తల్లోజు ఆచారి సంఘీభావం



మాదారం-రాచాలపల్లి బీటీ రోడ్డు సాధన కోసం నిర్వహిస్తున్న రిలే దీక్షలకు సంఘీభావం తెలిపిన తల్లోజు ఆచారి

ఊర్కొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదారం-రాచాలపల్లి మధ్య బీటీ రోడ్డు సాధనలో బీజేపీ నాయకులు బొల్లం నరేందర్ గౌడ్ మాదారం ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలకు రెండవ రోజు (ఆదివారం) జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళుతున్న ప్రజలకు మాదారం-రాచాలపల్లి మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సౌకర్యం కల్పించాల్సి ఉండగా వాటిని విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి నేటికి ప్రారంభించకపోవడం వారి అవివేకమని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేకుంటే పెద్దఎత్తున బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం ప్రారంభిస్తామని తెలిపారు.

వారి వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు దుర్గాప్రసాద్, జిల్లా కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, నాయకులు దివాకర్‌గౌడ్, ప్రశాంత్ గ్రామస్థులు జమ్ములు, సత్యనారి, నాగయ్య తదితరులు ఉన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని భగత్‌సింగ్ తండాలో నూతనంగా నిర్మించిన మేరీమా యాడి దేవాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జైపాల్ యాదవ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, ఐకృత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ తండ్రి సుంకిరెడ్డి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో కలరింగ్ కోసం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.2లక్షలు ఆర్థిక సహాయం చేశారని కమిటీ సభ్యులు తెలిపారు.

మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మృతి

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల నివాళులు



నివాళులర్పిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం ఎంగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుర్క జైపాల్‌యాదవ్, చల్లా వంశీచంద్ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాయకుడు పోతుగంటి భరత్‌ప్రసాద్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

వాసవీక్లబ్‌ల సేవలకు ప్రత్యేక గుర్తింపు



వాసవీక్లబ్ నాయకుడు జూలూరి రమేష్‌బాబును మెమొంటో శాలువాతో సన్మానిస్తున్న ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ

కల్వకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : వాసవీక్లబ్ సేవలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబులు అన్నారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 25వసంతాలు పూర్తి చేసుకున్న కల్వకుర్తి వాసవీక్లబ్‌లోని రమేష్‌బాబుతో పాటు నాయకులను మెమొంటోలు పూల మాలలు శాలువాలతో ఆదివారం సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సేవ లక్ష్యంగా ప్రతీ సభ్యుడు ముందుకు సాగాలని సూచించారు. నిరుపేదలైన అభాగ్యులకు అండగా నిలవాలని కోరారు. కలిమిచెర్ల రమేష్, గోపాల్, హరి కృష్ణ, మనోహర్, శ్రీనివాస్, రాఘవేందర్ తదిత రులు పాల్గొన్నారు.

'గురుకులాలను నాశనం చేసే కుట్ర నడుస్తున్నది'

తెలకపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : గురుకులాలను నాశనం చేసే కుట్ర జరుగుతున్నదని స్వేరోస్ టౌన్ అధ్యక్షుడు పరమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం స్వేరోస్ పట్టణ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ మాట్లాడుతూ తెలకపల్లి గురుకుల కళాశాలలో నడుస్తున్న సీజీటీ ఒకేషనల్ కోర్సును ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2019 సంవత్సరంలో ఒక మంచి ఉద్దేశంతోనే డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులందరికీ స్వయం ఉపాధి కల్పించడం ఈ కోర్సును ప్రవేశపెట్టగా ఇది ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం తెలకపల్లిలో ఒకేషనల్ కోర్సు తీసివేసే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. తెలకపల్లిలో ఒకేషనల్ కోర్సును యథావిధిగా కొనసాగించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. టౌన్ అధ్యక్షుడు బల్మూరు మల్లేష్, జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య, శ్రీరాములు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 20వేల మంది భక్తులు మైసమ్మ తల్లి దర్శనం చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

భక్తుల నుంచి ఈ ఆదివారం టికెట్ల ద్వారా 55వేల, హుండీ ద్వారా 1,33,258 రూపాయలు మొత్తం రూ.1,88,548 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వంగూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వంగూరు మండలంలోని నర్సంపల్లిలో ఆదివారం గ్రామానికి చెందిన గోపు పార్వతమ్మ (40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇంటి వద్ద పురుగుల మందు తాగిన పార్వతమ్మను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నెల క్రితమే భర్త వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. పిల్లల పోషణ భారమై మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొవ్వొత్తుల స్మారక దినోత్సవ ర్యాలీ

కందనూలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారి స్మారకార్థం ఆదివారం అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక ర్యాలీ నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మే నెల మూడవ ఆదివారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయిన వారి స్మారకార్థం, సంఘీభావం కోసం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. ఒక నిమిషం మౌనం పాటించారు. దిశా క్లస్టర్ మేనేజర్ రమేష్, డీపీఎంవో సుకుమార్‌రెడ్డి, జిల్ల ఫార్మసీ సూపర్‌వైజర్ సురేష్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ శివ శంకర్, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలైన ఎమ్మార్పీఎస్, వైఆర్‌జీకే సభ్యులు పాల్గొన్నారు.